సాక్షి ఒడిశా

సోమవారం । 25 । నవంబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 8,01,633

వెండి 111 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

భువనేశ్వర్/పూరీ



ఉల్లాసంగా.. ఉత్సాహంగా

కొరాపుట్ పర్వ్ ఉత్సాహంగా జరిగింది. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- 8లో



సాహిత్య రంగానికి..

కొరాపుట్‌లో సాహిత్య హర్షిత ఘనంగా జరిగింది. బాబూలాల్ కవితా సంకలనం ఆవిష్కరించారు.

- 8లో

న్యూస్‌రీల్

ట్రక్ డ్రైవర్ సజీవ దహనం



టోల్ గేటును ఢీకొని మంటల్లో దగ్ధమైన ట్రక్కు

భువనేశ్వర్: టోల్ గేటుకు ఢీకొన్న ప్రమాదంలో ట్రక్కు మంటల్లో చిక్కుకుంది. ఈ మంటల్లో ట్రక్కు దగ్ధమై డ్రైవరు సజీవ దహనమయ్యాడు. శనివారం అర్ధరాత్రి ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది. పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడుకు సరుకు రవాణా చేస్తుండగా ఈ ప్రమాదానికి గురైంది. పశ్చిమ బెంగాల్, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఈ దుర్ఘటన సంభవించింది. టోల్ గేటు ఆరో నంబరు వరుసలో అతి వేగంగా దూసుకు వచ్చిన ట్రక్కు ఇరు వైపులా ఉన్న రక్షణ కంచెని ఢీకొట్టింది. దీంతో మంటలు చెలరేగి టక్కు ఉన్న చోటనే కాలి బూడిదైంది. డ్రైవర్ బయటకు రాలేకపోయాడు. ఘటనలో టోల్ గేటు సిబ్బంది స్వల్పంగా గాయపడ్డారు. ఈ విషయం తెలియడంతో స్థానిక పోలీసులు, అగ్నిమాపక దళం ఘటనా స్థలం సందర్శించి మంటలు ఆర్పారు. ఈ ప్రమాదం ప్రేరేపించిన కారణాలు, పరిస్థితుల గూర్చి విచారణ చేపట్టారు. జలేశ్వర్ థాణా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి ఆవరణలో బైక్‌లు దగ్ధం



ఇంటి ఆవరణలో దగ్ధమైన బైక్‌లు

భువనేశ్వర్: నగరం శివారులోని గౌతాపట్న ప్రాంతంలో ఒకరి ఇంటి ఆవరణలో ఉన్న బైక్‌లు దగ్ధమయ్యాయి. ఆదివారం వేకువ జాము 3 గంటల ప్రాంతంలో ఈ సంఘటన దృష్టికి వచ్చినట్లు ప్రత్యక్ష సాక్షుల కథనం. గౌతపట్న ప్రాంతంలో సంతోష్ మహంతి అనే వ్యక్తి ఇంటి ఆవరణలో నిలిపిన 3 బైకులు, ఒక స్కూటీ మంటల్లో దగ్ధమయ్యాయి. రోజూ మాదిరిగా రాత్రి పూట బైక్‌ల్ని ఇంటి ఆవరణలో నిలిపి ప్రధాన ప్రవేశ మార్గం గేటు తాళం వేసి నిద్ర పోయారు. వేకువ జాము 3 గంటల ప్రాంతంలో మంటలు రగిలిన సంకేతాలు లభించడంతో ఇంటిల్లిపాదీ బయటకు వచ్చి చూసే సరికి మంటల్లో దగ్ధమైపోతున్న బైక్‌లు కనిపించాయి. దుండగుల్ని గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని బాధితులు చందకా థాణా పోలీసుల్ని అభ్యర్థించారు.

ఆకట్టుకున్న నృత్య పోటీలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు, మహిళలు

జయపురం: ప్రాచీన సంస్కృతి, కళలు, నృత్య, నాట్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా జయపురం తరుణ ప్రజ్ఞాభారతి ప్రతీ ఏడాది వివిధ పోటీలు నిర్వహిస్తుంది. అందులో భాగంగా ఆదివారం స్థానిక నారాయణీ ఆంగ్ల కళాశాల ప్రాంగణంలో చిన్నారులకు నృత్య, సంగీత, ఆదివాసీ, దేశభక్తి పాటల పోటీలు నిర్వహించింది. ఈ పోటీలలో పట్టణంలో గల వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మహిళల మధ్య ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు తరుణ ప్రజ్ఞాభారతి అధ్యక్షుడు తపన కిరణ్ త్రిపాఠీ, ఉపాధ్యక్షుడు రామ శంకర షాడంగి, సహాయ కార్యదర్శి అజయ్ కుమార్ మల్లిక్, కోశాధికారి రబీంద్ర మహరణ, ఇతర సభ్యులు నిర్వహించారు. ఈ పోటీల న్యాయ నిర్ణేతలుగా మహమ్మద్ షరీఫ్, శంకర దళపతి, అనిత బెహర, గీతా జయంతి పాత్రో, ఇతిశ్రీ సుబుద్ధి, జానకీ పాణిగ్రాహి, సబిత త్రిపాఠీ, తదితరులు పాల్గొన్నారు. డిసంబర్ 1వ తేదీ ఆదివారం గీతా శ్లోకాలు, చర్చలు, సంస్కృతిక జ్ఞానం పరీక్షలు నిర్వహిస్తామని అధ్యక్షుడు తపన కిరణ్ త్రిపాఠీ వెల్లడించారు.

డ్రోన్ సహాయంతో గుర్తించి.. గంజాయి తోట ధ్వంసం

రాయగడ: కొద్ది రోజులుగా జిల్లా పోలీస్, అబ్కారీ శాఖ అధికారులు గంజాయి అక్రమ సాగుపై దృష్టి సారించారు. ఈ క్రమంలో డ్రోన్ల సహాయంతో గంజాయి సాగవుతున్న ప్రాంతాలను గుర్తిస్తున్నారు. ఇలా గుర్తించిన ప్రాంతాల్లో విస్తృతంగా దాడులను నిర్వహించి గంజాయి వనాలను ధ్వంసం చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని గుడారి పోలీస్ స్టేషన్ పరిధి తంగరమ అటవీ ప్రాంతంలో గంజాయి సాగవుతుందని గుర్తించిన పోలీసులు, అబ్కారీ సిబ్బంది శనివారం సాయంత్రం ఆకస్మికంగా దాడులను నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదు ఎకరాల విస్తీర్ణంలోని 15 వేల గంజాయి మొక్కలను ధ్వంసం చేసినట్టు అధికారులు తెలిపారు.

రత్న భాండాగారంలో.. సొరంగాలు లేవు

- జనవరి నెల ఆఖరు నాటికి నిర్వహణ పనులు పూర్తి: మంత్రి



పృథ్వీ రాజ్ హరిచందన్, మంత్రి



డాక్టరు అరవింద కుమార్ పాఢి, సీఏఓ



శ్రీ మందిరం

భువనేశ్వర్: పూరీ గన్నాథుడు కొలువు దీరిన శ్రీ మందిరంలోని రత్న భాండాగారంలో అదనపు గదులు లేదా సొరంగాలు లేవని ఆలయం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టరు అరవింద కుమార్ పాఢి తెలిపారు. రాడార్ జీపీఆర్, జీపీఎస్ సర్వే ఈ విషయం తేటతెల్లం చేసిందన్నారు. ఈ వర్గాల సర్వే నివేదిక అధికారికంగా వెల్లడైందని సీఏఓ వివరించారు. హైదరాబాదుకు చెందిన సీఎస్ఐఆర్ – నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూటు (ఎన్‌జీఆర్ఐ) రత్న భాండాగారం రాడార్ సర్వే నిర్వహించింది. భారత పురావస్తు శాఖ ఏఎస్ఐ ఆధ్వర్యంలో ఈ సర్వే చేపట్టారు.

శ్రీ మందిరం పటుత్వం, భద్రతపై పాలన యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తుందని సీఏఓ హామీ ఇచ్చారు. రాడార్ సర్వే నివేదిక ఆధారంగా పరిరక్షణ, నిర్వహణ పనులు తక్షణమే ప్రారంభించేందుకు ఏఎస్ఐ అధికార వర్గాలతో తక్షణ సంప్రదింపులు ఆరంభించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యకలాపాల్లో భారత పురావస్తు శాఖ ఏఎస్ఐకి శ్రీ మందిరం పాలక వర్గం పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందజేస్తుందని అభయం ఇచ్చారు. ఈ మేరకు ఏఎస్ఐకి శ్రీ మందిరం పాలక వర్గం నుంచి లేఖ జారీ చేశారు. నివేదిక ఆధారంగా రత్న భాండాగారం సంరక్షణ, నిర్వహణ, మరమ్మతు పనుల కార్యాచరణ సమగ్ర సమాచారం తక్షణమే తెలియజేయాలని లేఖలో అభ్యర్థించారు. అనంతరం ఉభయ వర్గాలు ముఖాముఖి సమావేశమై రత్న భాండాగారం పనులు చేపట్టనున్నట్లు సీఏఓ వివరించారు. ఏఎస్ఐతో సంప్రదింపులు, చర్చలు పూర్తి కావడంతో ఛొత్తీషా నియోగుల ప్రతినిధులతో సమావేశమై రత్న భాండాగారం తుది కార్యాచరణ ఖరారు చేస్తారు.

ఛొత్తీషా నియోగుల సంప్రదింపులతో శ్రీ మందిరంలో రత్న వేదికపై మూల విరాటుల నిత్య, దైనందిన, ఉత్సవాది పూజాదులకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపడతారు. అలాగే సాధారణ భక్తులకు దర్శన సౌలభ్యం కొనసాగించేందుకు వ్యూహాత్మక కార్యాచరణ రూపొందిస్తారు.

సందిగ్ధత తొలగింది: మంత్రి

శ్రీ జగన్నాథుని రత్న భాండాగారంలో సొరంగాల్లో గుప్త నిధులు వగైరా సందిగ్ధతపై తెర తొలగిందని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ తెలిపారు. రాడార్ సర్వే నివేదిక ఈ విషయం స్పష్టం చేసిందన్నారు. దీంతో రత్న భాండాగారం మరమ్మతు, నిర్వహణ కార్యకలాపాల తొలి దశ ముగిసింది. మలి దశ ప్రక్రియ అతి త్వరలో ఆరంభం అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం మరియు ఛొత్తీషా నియోగుల సమన్వయ సంప్రదింపులతో ఈ పనులకు శ్రీకారం చడతారు.

రత్న భాండాగారంలో బంగారం, వెండి ఆభరణాలు, నగలు, పాత్రలు వంటి నిధిని సమగ్రంగా లెక్కించే ప్రక్రియని మలి దశ కార్యకలాపాల్లో పూర్తి చేస్తారు. మరమ్మతు, నిర్వహణ పనులతో ఆభరణాల లెక్కింపు వగైరా కార్యకలాపాల్ని వచ్చే ఏడాది జనవరి నెల ఆఖరు నాటికి ముగించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని మంత్రి వివరించారు. ఒకటి, రెండు రోజుల్లో భారత పురావస్తు శాఖ ఏఎస్ఐ రత్న భాండాగారం మరమ్మతు పనులు ప్రారంభిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

రత్న భాండాగారం నిర్వహణ, మరమ్మతు పనులతో ఆభరణాల లెక్కింపు చేపట్టేందుకు స్పష్టమైన మార్గదర్శకాల్ని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా చేపడుతున్న నిర్వహణ పనులతో రత్న భాండాగారం మరో 100 ఏళ్లపాటు పటిష్టంగా కొనసాగేలా జాగ్రత్త వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

వృద్ధురాలి ఇంటికి వెళ్లి పింఛన్ అందజేత



వృద్ధురాలు పున్నాలుకు పింఛన్ డబ్బులను అందజేస్తున్న పీఈఓ గోవింద్ సునీల్

రాయగడ: పింఛన్ కోసం మూడు కిలోమీటర్ల దూరం నడిచి వెళుతున్న వృద్ధురాలి అవస్థలపై ‘సాక్షి’లో ఈ నెల 23వ తేదీన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. జిల్లాలోని మునిగుడ సమితి ఘుముటాగడు పంచాయతీలోని జబగుడ గ్రామానికి చెందిన 80 ఏళ్ల గౌతే పున్నాలు పింఛన డబ్బుల కోసం ప్రతి నెల మూడు కిలో మీటర్ల దూరంలోని పంచాయతీ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. దీంతో ఆమె తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనవారు. ఈ విషయాన్ని సాక్షిలో ప్రచురించడంతో అధికారులు స్పందించారు. శనివారం ఆ సమితి బీడీవో దళపతి ఆదేశానుసారం పంచాయితీ పీఈవో గోవింద సునీల్ వృద్ధురాలి ఇంటికి వెళ్లి పింఛన్ మొత్తాన్ని అందించారు. దీంతో పున్నాలు ఆనందం వ్యక్తం చేశారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నీలమాధవ హికక


- ఎమ్మెల్యే నీలమాధవ హికక

రాయగడ: చికిత్స కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని బిసంకటక్ ఎంఎల్ఏ నీలమాధవ హికక అన్నారు. జిల్లాలోని కళ్యాణ సింగుపూర్‌లో ఉన్న పీహెచ్‌సీలో శనివారం సాయంత్రం జరిగిన రోగి కళ్యాణ సమితి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యధిక శాతం మంది ఆదివాసీలు నివసిస్తున్న ఈ ప్రాంతంలోని వారంతా పీహెచ్‌సీ, సీహెచ్‌సీలపై ఆధార పడుతుంటారన్నారు. అటువంటి వారికి సరైన చికిత్స అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఇదిలాఉండగా గత ఏడాది రోగి కళ్యాణ సమితికి ప్రభుత్వం మంజూరు చేసే నిధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా నిధులతో జరిగే అభివృద్ధి పనులపై చర్చించారు. పీహెచ్‌సీ అభివృద్ధిపై సమీక్షించారు. సమావేశంవో సీడీపీవో మమత రాణి దాస్, డాక్టర్ అన్నపూర్ణ తండి, రోగి కళ్యాణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

హడలెత్తించిన మంత్రి



బంగిరిపోషి ఘాటీ రోడ్డు పనులు సమీక్షించిన నగర అభివృద్ధి మంత్రి



ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఫోనులో నిలదీసిన మంత్రి

భువనేశ్వర్: రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణ కార్యకలాపాల్ని నగరాభివృద్ధి శాఖ మంత్రి డాక్టరు కృష్ణ చంద్ర పాత్రో ఆదివారం ప్రత్యక్షంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మయూర్‌భంజ్ జిల్లా బంగిరిపోషి ఘాటీ ప్రాంతం సందర్శించారు. నిర్ధారిత కాల పరిమితిలో రహదారి విస్తరణ వగైరా పనులు పూర్తి చేయించడం పట్ల విభాగం ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తుంది. లోగడ రెండు సార్లు మంత్రి ఈ ప్రాంతం ప్రత్యక్షంగా సందర్శించి సంబంధిత అధికారులతో స్పందించారు.

తాజాగా ఆదివారం మూడో సారి బంగిరిపోషి ఘాటీ ప్రాంతం రహదారి విస్తరణ పనుల పురోగతి సమీక్షించేందుకు మంత్రి సందర్శించారు. ఈ పనులు మందకొడిగా సాగుతున్నట్లు నిర్ధారించిన మంత్రి సంబంధిత అధికారులు పనులు జరుగుతున్న ప్రాంతం నుంచి ఫోన్ ద్వారా సంప్రదించారు. పనుల మందకొడితనంపై ఘాటుగా నిలదీశారు. ఈ క్రమంలో జాతీయ రహదారి అధికార వర్గం ఎన్‌హెచ్ఏఐని హడలెత్తించారు.

హడలెత్తించిన ఫోన్ సంభాషణ

49వ నంబరు జాతీయ రహదారి విస్తరణ పనుల సమీక్ష సమయంలో సంబంధిత అధికారుల గైర్హాజరు నిర్లక్ష్య వైఖరికి తార్కాణమని, ఈ అలసత్వమే పనుల మందకొడికి కారణమని, కుంటి సాకులు చెబుతు కాలక్షేపం చేసేందుకు నూకలు చెల్లాయని అన్నారు. 2, 3 రోజుల్లో పనులు పూర్తి కాకుంటే జైలులో పడేయడం లేదా సస్పెండు చేయడం తథ్యమని బాహాటంగా హెచ్చరించారు. నడి రోడ్డు మీద జిల్లా కలెక్టరు, పోలీసు సూపరింటెండెంట్ వంటి ఉన్నతాధికారుల సమక్షంలో ఎన్‌హెచ్ఏఐ అధికారులకు ఫోన్ చేసి తారస్థాయిలో మండి పడ్డారు.

నేడు యజ్ఞోపవీత సేవ



శ్రీ జగన్నాథ స్వామి

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని యజ్ఞోపవీత సేవ సోమవారం నిర్వహిస్తున్నారు. మార్గశిర కృష్ణ పక్షం ద్వాదశి తిథి పురస్కరించుకుని ఈ సేవ నిర్వహిస్తున్నట్లు శ్రీ మందిరం అధికార వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా సాధారణ భక్తులకు దర్శనం తాత్కాలికంగా నిలిపివేస్తారు. సోమవారం ద్వితీయ భోగ మండప సేవ తర్వాత యజ్ఞోపవీతం సేవ ఆరంభిస్తారు. సుమారు సాయంత్రం 5 గంటలకు ఈ సేవ ప్రారంభం అవుతుంది. నిరవధికంగా 4 గంటల వరకు కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో యజ్ఞోపవీతం సేవ ఆరంభం సాయంత్రం 5 గంటల నుంచి ముగింపు వరకు సుమారు రాత్రి 9 గంటల వరకు దర్శనం తాత్కాలికంగా నిలిపి వేయనున్నట్లు శ్రీ మందిరం అధికార వర్గాలు ప్రకటించాయి.

గుప్త సేవ

శ్రీ జగన్నాథుని శ్రీ అంగ సంరక్షణలో భాగంగా ఏడాది పొడవునా క్రమ పద్ధతిలో పలు రకాల గుప్త సేవలు చేపడతారు. శ్రీ ముఖ అలంకరణ (బొనొకొ లగ్గి) తరచు జరిగే గుప్త సేవ కాగా యజ్ఞోపవీతం, రాహు రేఖ, చిత్తా లగ్గి వంటి అరుదైన సేవలు నిర్వహిస్తుంటారు. దైతపతి సేవకులు ఈ సేవల్ని నిర్వహిస్తారు.

పూరీలో రాష్ట్రపతి పర్యటన



పూరీ జిల్లా పోలీసులతో డీజీపీ సమీక్ష సమావేశం

- ఏర్పాట్లు సమీక్షించిన డీజీపీ
- 80 ప్లాటూన్ల పోలీసులతో భద్రత
- 300 మంది అధికారుల పర్యవేక్షణ

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. డిసెంబరు నెల 4వ తేదీ నుంచి రాష్ట్రపతి పర్యటన ప్రారంభం కానుంది. పూరీ బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో నేవీ డే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా శ్రీ మందిరం సందర్శించి శ్రీ జగన్నాథుని దర్శించుకుంటారు. అనంతరం గోపబంధు ఆయుర్వేద కళాశాల వజ్రోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొంటారు. భారత రాష్ట్రపతి పర్యటన ఆద్యంతం గట్టి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లుని రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ వైబీ ఖురానియా ఆది వారం సమీక్షించారు. ఈ సందర్భంగా డీజీపీ శ్రీ మందిరం, బ్లూ ఫ్లాగ్ బీచ్, ఆయుర్వేద కళాశాల ప్రాంగణాలు ప్రత్యక్షంగా సందర్శించారు. పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. 300 మంది సీనియర్ పోలీసు అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో 80 ప్లాటూన్ల పోలీసుల్ని భద్రతా కార్యకలాపాలకు నియమిస్తున్నారు. భువనేశ్వర్ నుంచి పూరీ, పూరీ పట్టణ వ్యాప్తంగా వాహనాల కదలికపై ప్రత్యేక నియంత్రణ వ్యూహం ఖరారు చేశారు. నావికా దినోత్సవం పురస్కరించుకుని 25 ఓడలతో 40 ఎయిర్ క్రాఫ్టులతో ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శన తిలకించేందుకు విచ్చేసిన సాధారణ ప్రజానీకం భద్రత, రక్షణ పట్ల పోలీసు యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందని పోలీసు అధికారులు డీజీపీకి వివరించారు.

కలెక్టర్ కార్యాలయం ముట్టడి రేపు



సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు మహంతి తదితరులు

జయపురం: ఈ నెల 26వ తేదీన రాజ్యాంగ దినం సందర్భంగా కొరాపుట్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన జరిపేందుకు ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) నిర్ణయించింది. ఆదివారం స్థానిక కార్మిక భవనంలో జరిగిన కార్మిక సంఘాల సమావేశంలో ఏఐటీయూసీ నాయకుడు ప్రమోద్‌కుమార్ మహంతి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తం ఆందోళనలో భాగంగా ఇక్కడ కూడా ముట్టడి కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కార్మిక, రైతు సమస్యలపై గవర్నర్లకు వినతి పత్రాలను సంఘ నాయకులు అందజేస్తారన్నారు. ఇందులో భాగంగా ఒడిశా రాష్ట్ర గవర్నర్‌ను ఉద్దేశించి కొరాపుట్ జిల్లా కలెక్టర్‌కు జిల్లా కార్మిక సంఘాల తరఫున మెమోరాండం సమర్పిస్తామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్మిక నేతలు సుదర్శణ బిశాయి, సుభాష్ బెహర, అలోక్ పాత్రో, ఉమా శతపతి, ప్రహ్లాదమల్లిక్ పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట యువతులకు ఎర

- బంగ్లాదేశ్ నుంచి రప్పించి వేశ్య వృత్తిలోకి దింపుతున్న వైనం



విలేకర్ల సమావేశంలో నగర డీసీపీ పినాకి మిశ్రా

భువనేశ్వర్: బంగ్లాదేశ్ యువతులతో వేశ్య వ్యాపారం రాష్ట్రంలో కలకలం రేపుతోంది. ఉద్యోగం, ఉపాధి హామీ వంటి బూటకపు హామీలు, మాయ మాటలతో అమాయక యువతుల్ని రప్పించుకుని వేశ్య వృత్తిలో వినియోగిస్తున్న వ్యవహారం బట్టబయలైంది. ఈ వ్యవహారంలో సందిగ్ధ సూత్రధారులైన దంపతుల్ని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. బంగ్లాదేశ్ నుంచి 23 మంది యువతుల్ని మోసగించి నగరానికి రప్పించినట్లు ప్రాథమిక సమాచారం. వీరందరికి ఉద్యోగంతో హామీ పూర్వక ఉపాధి కల్పిస్తామని మోసగించి తీసుకుని వచ్చారు. బూటకపు మాటలతో మోసపోయి స్వరాష్ట్రం వీడి ఇక్కడకు చేరిన యువతులకు రోజుకు రూ. 2,000 చొప్పున చెల్లిస్తామని నమ్మించి వేశ్య వృత్తిలోకి దించినట్లు బాధిత వర్గం నుంచి బయటకు పొక్కింది. కటక్ నగరం లింక్ రోడ్ ప్రాంతంలో వీధుల్లో తచ్చాడుతూ తిరుగుతున్న బాలిక కదలికపై పోలీసులకు సందేహం కలిగి అదుపులోకి తీసుకుని బాలల సంక్షేమ కమిటీకి తరలించారు. తదుపరి విచారణలో ఆమె బాలికగా తేలింది. బంగ్లాదేశ్ నుంచి ఇక్కడకు రప్పించిన శైలి పూర్తి క్రమం తెలుసుకుని పోలీసుల సహకారంతో ముఠాపై దృష్టి సారించారు. వాట్సాప్, ఫేస్‌బుక్ ఇతరేతర సోషల్ మీడియా వేదికల్లో పరిచయం చేసుకుని తమకు ఈ వృత్తిలోకి లాగినట్లు వాపోయారు. ఈ అక్రమ వ్యాపారంలో దళారుల గుట్టు రట్టు చేసేందుకు కమిషనరేటు పోలీసులు సన్నాహాలు ఊపందుకున్నట్లు నగర డీసీపీ పినాకి మిశ్రా తెలిపారు. బాధితుల ద్వారా అందిన సమాచారం ఆధారంగా దళారులపై నిఘా పటిష్టపరిచారు. ఈ ప్రయత్నంలో అనుమానితుల్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. బాధిత బాలిక వాంగ్మూలం ఆధారంగా శిశు సంక్షేమ కమిటీ పోలీసు వర్గాలకు దాఖలు చేసిన సమాచారం ఆధారంగా ఫిర్యాదు (ఎఫ్ఐఆర్) నమోదు చేసినట్లు నగర డీసీపీ వివరించారు. దర్యాప్తుకు బలపరిచే ఆధారాలు, సమాచారం బాలిక అందజేయలేకపోతుంది. అరకొర సమాచారం ఆధారంగా లోతుగా దర్యాప్తు చేపట్టేందుకు పలు బృందాలుగా పోలీసుల్ని రంగంలోకి దింపారు.

స్వరాష్ట్రంతో సంప్రదింపులు

కటక్ పోలీసుల దృష్టికి వచ్చిన బాలిక స్వదేశం బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లిపోతానని అభ్యర్థిస్తుంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ రాయబారి కార్యాలయ వర్గాలతో సంప్రదింపులు జరపనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన



నిరసన తెలియజేస్తున్న కార్మిక నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేఖ విధానాలపై భవిష్యత్తులో ఉద్యమం ఉద్ధృతం చేయనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ అన్నారు. అరిణాం అక్కివలస గ్రామం పరిధిలో ఉన్న శ్యాంక్రిగ్ పిస్టన్స్ ప్లాంట్–3 వద్ద ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమల్లో విఫలమైందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు అశోక్, సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలు వీడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

రణస్థలం: కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు వీడాలని జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు వెలమల రమణ అన్నారు. రణస్థలంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి సర్కారు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నాయని మండిపడ్డారు. కార్మిక , రైతు చట్టాలను నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జోగిబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా డాక్టర్ పూడి కిరణ్‌కుమార్



కవిటి: జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కవిటి మండలం కవిటి కొత్తూరుకు చెందిన జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమత నాగిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్టు పేర్కొన్నారు. తన ఎంపికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో జమిలి ఎన్నికల నాటికి జిల్లా యువజన విభాగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు.

కెనైన్ డాగ్‌తో తనిఖీలు



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తనిఖీలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : గంజాయి అక్రమ రవాణా అరికట్టడంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాలు, ప్రైవేట్ ట్రావెల్స్ ఏజెన్సీల్లో ఆదివారం రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు జాగిలం కెనైన్ డాగ్‌తో తనిఖీలు చేపట్టారు. బస్సులు, రిజర్వేషన్ కౌంటర్ వద్ద పార్శిళ్లను, బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ఆర్టీసీ బస్సుల ప్రారంభం నేడు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం జోన్ జోనల్ చైర్మన్‌గా సియ్యారి దొన్నుదొర సోమవారం విజయనగరం బస్ స్టేషన్ ఆవరణలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి ఆర్టీసీ చైర్మన్ కొనకాల నారాయణ తదితరులు హాజరుకానున్నారు. అనంతరం ఆర్టీసీ శ్రీకాకుళం 1, 2వ డిపోలకి చెందిన మూడు కొత్త అద్దె బస్సులను ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండవ డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కె.ఆర్.ఎస్.శర్మ కోరారు.

వైభవంగా లక్ష దీపోత్సవం



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కొత్తూరు: మండల కేంద్రంలోని పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆదివారం రాత్రి లక్ష దీపోత్సవం కనుల పండువగా సాగింది. ఆలయ ధర్మకర్తలు బరాటం గోవిందరావు, వేలాది మంది భక్తుల సమక్షంలో వివిధ ఆకృతుల్లో దీపాలు వెలిగించారు. అంతకుముందు ప్రత్యేక పూజలు, అన్నదానం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



జ్యోతిని ర్యాలీగా తీసుకువస్తున్న ఎమ్మెల్యే, తదితరులు



పర్వ్ ర్యాలీలో పాల్గొన్న ప్రజలు



ఆదివాసీ కళాకారుల నృత్య ప్రదర్శన

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయటమే కొరాపుట్ పర్వ్ లక్ష్యం
- ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి



జావెలిన్ త్రో పోటీలో క్రీడాకారులు



ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్



పర్వ్ సభలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

జయపురం: మరుగున పడిన కొరాపుట్ యువత ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయటమే కొరాపుట్ పర్వ్ ఆదివాసీ మహోత్సవం ప్రధాన లక్ష్యమని జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి అన్నారు. జయపురం మున్సిపాలిటీ స్థాయి కొరాపుట్ పర్వ్ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీలు శాంతిప్రియులని, వారి నిజ జీవితంలో నృత్యం, నాట్యం అంతర్ బాగాలన్నారు. అబ్బురపరచే వారి డాన్స్‌లు, కళలు మరుగునపడి ఉన్నాయని వాటిని ప్రపంచ ప్రజలకు పరిచయం చేయటమే కొరాపుట్ ప్రధాన లక్ష్యమన్నారు. జయపురం మున్సిపాలిటీ నిర్వహించిన మూడు దినాల పర్వ్ ఉత్సవాలను ఆదివారం ప్రారంభించారు. ఉదయం మా భగవతి మందిరం వద్ద నృత్య, నాట్యాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యేతోపాటు జయపురం సబ్‌కలెక్టర్ అక్కవరం శొశ్య రెడ్డి, సబ్ డివిజన్ పోలీసు అధికారి అంకిత కుమార్ శర్మ, మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, మున్సిపాలిటీ కార్యనిర్వాధికారి కృతిబాస్ నాయక్‌తో పాటు అనేకమంది క్రీడాకారులు, విద్యార్థులు, ఆదివాసీ కళాకారులు పాల్గొన్నారు.

ర్యాలీ విక్రమ క్రీడా మైదానికి చేరుకొన్న తరువాత పర్వ్ సభ నిర్వహించారు. సభలో ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్, తదితరులు ప్రసంగించారు. వేదికపై ఆదివాసీ నృత్య, నాట్యాలు ప్రదర్శించారు. క్రీడా పోటీలను నిర్వహించారు. 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు పరుగు పందాలు, షార్ట్‌పుట్, డిస్కో త్రో పోటీలు నిర్వహించారు. జయపురం సబ్‌డివిజన్ అథ్లటిక్ అసోసియేషన్ కార్యదర్శి రబినాయక్ నేతృత్వంలో సీనియర్ క్రీడాకారులు శ్రీకాంత చౌదరి, జి.సత్యనారాయణ, శ్రీను సెట్టి, జక్మీర్ ధనపూల్, తరంగలత షొడంగి, పి.రాజేశ్వరి, టిసు మిశ్ర, సుభేందు ప్రదాన్, గగన పట్నాయక్‌లు క్రీడా పోటీలను పర్యవేక్షించారు. జూనియర్, సీనియర్లుగా విభజించి పోటీలు నిర్వహించారు.



పర్వ్ వేదికపై చిన్నారుల ఆదివాసీ నృత్యం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



ఫుట్‌బాల్ పోటీలో పాల్గొనున్న టీమ్‌లు

సాహిత్య రంగానికి పెద్దపీట వేయాలి



బాబూలాల్ కవితా సంకలనాన్ని ఆవిష్కరించి ప్రజలకు అంకితం చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

- ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం:కొరాపుట్ జిల్లా అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా ఉన్నా నేటివరకు పాలకులు చిన్నచూపు వలన వెనుకబడి ఉందన్నారు. అనేక మంది సాహిత్య కారులున్నా రాష్ట్ర స్థాయి సాహిత్య సన్మానం ఒక్కరికీ లభించకపోవటం విచారకరమన్నారు. సాహిత్యరంగానికి పెద్దపీట వేయాలని జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి అన్నారు. ఆదివారం దొద్ర గ్రామం ఆదివాసీ కుటుంబ సంస్థ జయపురం ఎస్.ఎర్.మాల్ లో నిర్వహించిన సాహిత్య హర్షితా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మన జిల్లా సాహిత్యరంగంలో అగ్రగామిగా నిలవాలంటే సాహితీవేత్తలకు, రచయితలను ప్రజలు ఆదరించి, ప్రోత్సహించాలని ప్రజలకు, సాహితీ అభిమానులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యవక్తగా పాల్గొన్న సరల అవార్డు గ్రహీత డాక్టర్ సరోజినీ సాహు మాట్లాడుతూ కొరాపుట్ జిల్లా సాహిత్య రంగంలో వెనుకబడి లేదని, జయపురం మట్టిలో సత్య మిశ్ర లాంటి ప్రముఖ సాహితీవేత్త పుట్టారని ఉదహరించారు. ఆదివాసీ కుటుంబ సంస్థ అధ్యక్షుడు సయిమన్ బిడిక అధ్యక్షతన జరిగిన సాహితీ చర్చలో చరిత్రలో కొరాపుట్ విముక్తి సంగ్రామం, ఆదివాసీ అశ్మిత, పాఠకులు ఏం కోరుతున్నారు, కొరాపుట్ సంగీతం, చలన చిత్ర భవిష్యత్‌పై సాహితీ చర్చ జరిగింది. ఈ చర్చలో ప్రముఖ పరిశోధకుడు శ్రీరంగ నాయక్, కవి బలరాం పూజారి, కళాకారుడు చంద్ర కాంత బిశ్వాల్ పాల్గొన్నారు. శ్యామలేషన్ గుప్త బెంగార్ రచనను ధర్మరాజ్ అనువాదం 'బాబూలాల్' కవితా సంకళనాన్ని అతిథులు విడుదల చేసి ప్రజలకు అంకితం చేశారు. కె.వి.విజయలక్ష్మీ పాణిగ్రహి, విమళ దాస్ పట్నాయక్, మనోరంజన్ త్రిపాఠీ, రంజన్ మహరియ, సుజాత మహాపాత్రో, ప్రొఫెసర్ అలోక్ బరాల్, అజిత్ కుమార్ భొయి, రఘునాథ్ బిశ్వాల్, పలువురు రచయితలు సాహితీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సందడిగా వనమహోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్ శర్మ

రాయగడ: స్థానిక ఉత్కళాంధ్ర బ్రహ్మణ సేవాసమాజం ప్రతీ ఏడాదిలా ఈసారి కూడా పితామహల్‌లో గల వనదుర్గ మందిరం ప్రాంగణంలో ఆదివారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించింది. సమాజం అధ్యక్షుడు రేజేటి శ్రీనివాస్ శర్మ, కార్యదర్శి భళ్లమూడి నాగరాజు, ఉపాధ్యక్షుడు ఎ.నారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఆనందోత్సావాల మధ్య కొనసాగింది. ఆటపాటలతో అలరించింది. 73 ఏళ్ల వృద్ధుడు కె.చంద్రశేఖర్ శర్మ నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. క్విజ్, పాటల పోటీలను కూడా నిర్వహించారు. గెలిపొందిన వారికి బహుమతులను అందజేశారు. సమాజం అధ్యక్షుడు శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ..అందరి సహకారంతో సమాజం ఎంతో ముందుకు వెళ్తుందన్నారు. త్వరలో సమాజం సొంత కార్యాలయ భవనం నిర్మించేందుకు సన్నహాలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎంతో మంది నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలను అక్కున చేర్చుకుని వారికి అండగా నిలిచిందని వివరించారు. ఇకపై కూడా సేవా కార్యక్రమాలను కొనసాగించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. సమాజంకు చెందిన కె.శేషసాయి, కె.గౌరి ప్రసాద్ పాటలు పాడి అందరినీ అలరింపజేశారు.



పాటలు పాడుతున్న శేషసాయి, గౌరి ప్రసాద్



నృత్యం చేస్తున్న వృద్ధుడు చంద్రశేఖర్ శర్మ

విన్యాసాలు అదుర్స్

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్‌బీఎస్‌వైఎం డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ 76వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రవీణకుమారి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ పతాకావిష్కరణ చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పిరిమిడ్ల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

– కాశీబుగ్గ









స్కూల్‌గేమ్స్ జూడోలో పతకాల పంట



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ మేనేజర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్–19 బాలబాలికల జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. రేణిగుంట వేదికగా ఈ నెల 24, 25 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో రెండు బంగారు, మూడు కాంస్య పతకాలతో కలిపి మొత్తం ఐదు పతకాలు సాధించి శభాష్ అనిపించారు. బాలురు విభాగంలో ప్రసాద్ బంగారు పతకం, నవీన్, శివ, షణ్ముఖ కాంస్య పతకాలు సాధించగా, బాలికల విభాగంలో సౌమ్య బంగారు పతకం సాధించింది. ఓవరాల్ చాంపియన్‌షిప్ కేటగిరిలో బాలురు 3వ స్థానంలో, బాలికలు 4వ స్థానంలో నిలిచి సత్తాచాటారు. మేనేజర్‌గా వ్యవహరించిన పి.జగదీశ్వరరావు(పీఈటీ పోలవరం), క్రీడాకారులను డీఈఓ తిరుమల చైతన్య, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు బీవీ రమణ, ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, జూడో సంఘ ప్రతినిధులు ఆదివారం అభినందించారు.

సాయిబాబా గుడిలో చోరీ

బూర్జ: మండలంలోని కొల్లివలసలో సాయిబాబా గుడిలో వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. సాయిబాబా మందిరంలో భక్తుల దర్శనార్థం ప్రధాన అర్చకులు గుడి తలుపుల వేయకుండా వెళ్లిపోయారు. శుక్రవారం దర్శనానికి వచ్చిన భక్తులు వెండి కిరీటం, శఠగోపం కలిపి సుమారు 25 తులాల ఆభరణాలు కనిపించకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రస్థాయి వీవీఎం పోటీలకు సిక్కోలు విద్యార్థులు



హరిణి



నవీన వైష్ణవి వేదశ్రీ

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) ప్రతిభా పరీక్షల్లో జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఎన్‌సీఈఆర్‌టీ, విజ్ఞాన్ ప్రసార్, ఎన్‌సీఎస్ఎమ్‌లు సంయుక్తంగా గత నెల దేశవ్యాప్తంగా పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీల్లో వి.హరిణి(9వ తరగతి, గుజరాతీపేటలోని వరం మున్సిపల్ స్కూల్), బలివాడ నవీన, సీఎల్ఎన్ వైష్ణవి, జామి వేదశ్రీ (శ్రీకాకుళం హౌసింగ్‌బోర్డ్ కాలనీలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్), రాష్ట్ర స్థాయికు ఎంపికైనవారిలో ఉన్నారని వీవీఎం పరీక్షల జిల్లా సమన్వయకర్త అన్నెపు పున్నయ్య తెలిపారు. వచ్చే నెల 15న రాజమండ్రి వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి పోటీల శిబిరానికి వీరు హాజరవుతారని పేర్కొన్నారు. విద్యార్థులను జిల్లా విద్యాశాఖధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, ఉప విద్యాశాఖాధికారి ఆర్. విజయకుమారి, కౌషల్ కో ఆర్డినేటర్లు మధుబాబు, ఉమేష్‌కుమార్, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు అభినందించారు.

మహిమాన్వితం సూర్యోపాసన



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న షణ్ముఖశర్మ

శ్రీకాకుళం కల్చరల్: సూర్యోపాసన ఎంతో మహిమాన్వితమైనదని, సాధనతో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని రుషిపీఠం వ్యవస్థాపకులు సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఉపనిషన్మందిరం, సుమిత్రా కళాసమితి సంయుక్త నిర్వహణలో 'శ్రీసూర్య దర్శనం'పై ప్రవచన యజ్ఞం రెండో రోజు ఆదివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకు దేహానికి ఉన్న సంబంధం రాజుకు, ప్రజలకు మధ్య ఉన్న సంబంధం వంటిదన్నారు. రాజ్యపాలన భోగం కోసం కాదని, యోగం కోసమని చెప్పారు. కార్యక్రమంలో మందిరం అధ్యక్షులు గుమ్మా నగేష్, సుమిత్రా కళా సమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ, నిష్టల నర్సింహమూర్తి, పులఖండం శ్రీనివాసరావు, గుత్తు చిన్నారావు, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, తెన్నేటి విక్రమశర్మ, మండవిల్లి రవి, కిల్లాన ఫల్గుణ రావు, కొంక్యాన మురళీధర్, వి.కామేశ్వరరావు, పి.బాబూరావు, సనపల నారాయణమూర్తి, రమేష్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

హైందవ ధర్మాన్ని కాపాడుకుందాం



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న స్వామి శ్రీనివాసానంద

పొందూరు: హైందవ సమాజాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఉత్తరాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద అన్నారు. మండలంలోని కృష్ణాపురం ఆనందాశ్రమంలో అఖిలాంధ్ర హిందూ మహా సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ నిత్యం శ్రీరామనామ జపం, అభిషేకాలు వంటివి చేస్తే హింధూ ధర్మం కాపాడిన వారమవుతామని చెప్పారు. స్త్రీలను అగౌరవపరచడం, గోహత్యలు, దేవాలయ వ్యవస్థ సరిగా లేకపోవడం, ధార్మిక గ్రంథాలను తప్పడు భావాలతో ప్రచారం చేయడం వంటి దుర్మార్గపు చర్యలను అడ్డుకోవాలన్నారు. హింధూ ధర్మ పరిరక్షణకు అందరూ ఏకంకావాలని పిలుపునిచ్చారు. ముస్లింలకు వక్ఫ్‌బోర్డు, క్రిస్టియన్లకు ప్రత్యేక బోర్డులు ఉన్నట్లు, హిందువులకు కూడా ప్రత్యేక బోర్డులను ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఒంగోలు భైరవానంద స్వామి, మంగళగిరి దయానంద దత్త స్వామి, అహోబిల జీయర్ స్వామీ, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఏపీఎస్టీఏ జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక



మాట్లాడుతున్న ఏపీఎస్టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్(ఏపీ ఎస్టీఏ) శ్రీకాకుళం జిల్లాశాఖ నూతన కార్యవర్గం ఎంపిక ఆదివారం జరిగింది. శ్రీకాకుళం ఎన్జీవో హోంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మజ్జి చిన్నబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు, కొర్ల ఆనందరావు, జోగారావు, సాయిరాజ్, నారాయణరావు తదితరులు హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా సప్పటి మల్లేసు(ఇచ్ఛాపురం), ప్రధాన కార్యదర్శిగా పంచాది గోవిందరాజులు (పొందూరు), కోశాధికారిగా ఎస్.దాలప్పన్న (సంతబొమ్మాలి), కార్య నిర్వాహక అధ్యక్షుడిగా మేడిశెట్టి సాయిరాజ్ (జలుమూరు), సహాధ్యక్షుడిగా నెమలిపురి విష్ణుమూర్తి (వజ్రపుకొత్తూరు), ప్రధాన కార్యదర్శిగా పంచాది గోవింద రాజులు (పొందూరు), సంయుక్త కార్యదర్శిగా కె.కె.రామిరెడ్డి (టెక్కలి), కోశాధికారిగా యస్.దాలప్పన్న (సంతబొమ్మాళి), ఉపాధ్యక్షులుగా జగన్నాథ గౌడో (పలాస), సింగిపురం మురళి (పోలాకి), రోణంకి మోహనరావు (పాతపట్నం), నాగవంశపు సురేష్ (వజ్రపుకొత్తూరు), కార్యదర్శులుగా బొడ్డేపల్లి రామకృష్ణ (నందిగాం), మెట్ట రాంబాబు (నరసన్నపేట), కొయ్య పద్మనాభ రెడ్డి (ఇచ్ఛాపురం), మురిపాల జగన్నాథం (కవిటి), ఇతర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

క్లుప్తంగా

పిక్నిక్ స్పాట్స్‌పై నిఘా



సముద్రతీరం వద్ద భద్రతా ఏర్పాట్లలో పూసపాటిరేగ పోలీసులు

విజయనగరం క్రైమ్: కార్తీక మాసం వారాంతం సందర్భంగా విహార యాత్రలు, పిక్నిక్‌లకు ఎక్కువ మంది ప్రజలు వెళ్లే అవకాశం ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతో పాటు, ముందస్తుగా నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విహార యాత్రలు నిర్వహించే ప్రాంతాలు, పిక్నిక్ స్పాట్స్ వద్దకు వచ్చే మహిళలు, యువతులు, ఈవ్‌టీజింగ్‌కు, వేధింపులకు గురికాకుండా మహిళల భద్రతకు సంబంధిత అధికారులు భద్రత ఏర్పాట్లు చేపట్టడంతో పాటు, డే బీట్లు, బందోబస్తు , మహిళా బీట్లను ఏర్పాటు చేసి, ఎటువంటి అల్లర్లు జరగకుండా చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. పిక్నిక్ పేరుతో అసాంఘిక కార్యకలాపాల నిర్వహణకు తావులేకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి, పేకాట , జూదం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం వంటి కార్యకలాపాలు జరగకుండా నిర్వాహకులతో ముందుగా సమావేశమై, అసాంఘిక కార్యకలాపాలు, చట్ట విరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరడం, సత్ఫలితాలనిచ్చిందన్నారు. భద్రత ఏర్పాట్లను విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు పర్యవేక్షించగా, సంబంధిత సీఐలు, ఎస్ఐలు భద్రతాచర్యలు చేపట్టారని వివరించారు.

పూరిల్లు దగ్ధం

మెంటాడ: మండలంలోని చింతలవలసలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన ముచ్చర్ల కోటేశ్వరరావు పూరిల్లు కాలిపోయింది. కోటేశ్వరరావు అతని భార్య ఉదయాన్నే దేవుడి మూలన దీపం పెట్టి పక్కనే ఉన్న పిట్టాడ గ్రామంలో వ్యవసాయ కూలీ పనులకోసం వెళ్లారు. వారు వెళ్లిన కాసేపటికి ఇంటినుంచి పొగలు రావడం గమనించిన సర్పంచ్ కలిశెట్టి సూర్యనారాయణ తక్షణమే స్పందించి చుట్టుపక్కల ప్రజలతో కలిసి ఆర్పేప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. దీపం అంటుకుని ఇల్లు కాలిన ట్లో స్థానికులు చెబుతున్నారు. ఇంట్లో ఉన్న బట్టలు, రూ.25 వేలు, పావుతులం బంగారం , ఇంట్లోని సామగ్రి, తిండి గింజలు మొత్తం కాలిపోయాయని బాధిత కోటేశ్వరరావు దంపతులు లబోదిబోమంటున్నారు. సుమారు లక్షరూపాయలు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. సమాచారం మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధారాణి, వీఆర్ఓ కొండమ్మ వచ్చి కాలిపోయిన ఇంటిని పరిశీలించారు.

పోలీసుల అదుపులో పేకాటరాయళ్లు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఎస్సై బి.గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి దగ్గర ఉన్న రూ.13,150 నగదు సీజ్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం కోర్టుకు అప్పగించారు. బహిరంగ ప్రదేశాల్లో జూదం ఆడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. గ్రామాల్లో కోడిపందాలు, పేకాట, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఫోన్ 9121109444 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

1400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

సాలూరు రూరల్: మండలంలోని సారిక, నేర్లవలస గ్రామాల మధ్యలో నిర్వహిస్తున్న సారా తయారీ కేంద్రాలపై రూరల్ ఎస్సై నరసింహమూర్తి సిబ్బందితో కలిసి ఆదివారం ఉదయం దాడి చేసి 1400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. తయారీ కేంద్రం వద్ద నేర్లెవలసకు చెందిన డిప్ప చిన్నయ్యను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలి పారు. అలాగే 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడిలో కానిస్టేబుల్స్ శివశంకర్, గొర్లె గోపి, రాబాబు, సురేష్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

నెల్లిమర్ల: యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం స్థానిక ప్రభుత్వ పింఛన్‌దారుల భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, జిల్లా గౌరవాధ్యక్షులు మీసాల అప్పలనాయుడు హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి పొట్నూరు వాసుదేవరావు వ్యవహరించారు. యూటీఎఫ్ నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా మద్దిల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా లెంక సన్యాసినాయుడు, గౌరవాధ్యక్షుడిగా గాడు పరమేశ్వరరావు, సహాధ్యక్షులుగా వంగపండు సురేష్ బాబు, కొండల పద్మావతి, కోశాధికారిగా బోని రమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సురట రాజేంద్రప్రసాద్, సీపీఎస్ కన్వీనర్‌గా సుంకర చలపతిరావు, జిల్లా కౌన్సిలర్లుగా రెడ్డి అసిరినాయుడు, గొర్లె మధు, బి.లక్ష్మణరావు, చందక కృష్ణ, పీపీ శ్రీనివాసరావు, కొండపల్లి జయరామ్, జి.కుమారస్వామి, రెడ్డిపల్లి చంద్రకళ, మాత కిశోర్‌కుమార్, ఎస్.సప్తగిరి ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గాన్ని జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాథ్ అభినందించారు.

విద్యార్థుల ఆలోచనకు ▸ అద్భుత అవకాశం



ఈ తరహా విద్యార్థులు తమ ఆలోచనకు పదును పెట్టాల్సి ఉంది

- కేంద్ర సహకారంతో స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్
- ఆలోచనల సమర్పణకు ఈనెల 30 వరకూ గడువు

పాలకొండ రూర్: కేంద్రప్రభుత్వం చొరవతో 21వ శతాబ్దపు నైపుణ్యాలను విద్యార్థులకు అందించడం ద్వారా వారిని ట్రాన్స్‌ఫర్మేటివ్ నాయకులుగా తీర్చిదిద్దవచ్చని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఈ క్రమంలో ఉద్దేశించిన కార్యక్రమమే స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ, అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి ఆయోగ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. 2023వ సంవత్సరంలో నిర్వహించిన కార్యక్రమంలో19 వేల మందికి పైగా విద్యార్థులు తమ ఆలోచనలకు పదునుపెట్టి ఇన్నోవేషన్‌లను రూపొందించారు. తాజాగా 2024లో ఈ కార్యక్రమానికి సంబంధించిన ప్రక్రియ ఈ ఏడాది ఆగస్టులో మొదలైంది. దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులతో నమోదైన ఐడియాలలో మొదటి 400 స్థానాల్లో నిలిచిన ప్రాజెక్ట్స్ ఇంటర్న్‌షిప్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అందులో మొదటి 75 స్థానాలలో నిలిచిన ప్రాజెక్ట్స్‌కు మెంటర్‌షిప్‌ను అందిస్తారు. ఇందుకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అటల్ ఇన్నోవేషన్ మిషన్ అందిస్తుంది. విద్యార్థులకు నగదు బహుమతిని నీతి ఆయోగ్ అందించి ప్రోత్సహిస్తుంది. ఇందుకు సంబంధించి 6-10 తరగతుల మధ్య విద్యార్థులు అర్హులుగా విద్యాశాఖ స్పష్టం చేస్తోంది. ఈ క్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా నుంచి 180 పాఠశాలు రిజిస్టర్ చేసుకోగా 536 మంది ఉపాధ్యాయుల సహకారంతో 4010 మంది విద్యార్థులు 1429 థీమ్స్‌ను సిద్ధం చేశారు.

థీమ్స్ ఇలా..

1. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్
2. అర్టిఫిషల్ ఇంటలిజెన్స్
3. ఆరోగ్యం/సంరక్షణ
4. ఎకానమిక్ ఎంపవర్‌మెంట్

గడువులోగా సబ్‌మిట్ చేయాలి



ఇప్పటికే జిల్లాలోని అందరు సైన్స్ ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ మోడ్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురించి ఓరియంటేషన్ పూర్తి చేశాం. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది. రిజిస్టర్ అయిన విద్యార్థులు తమ ఆలోచనలను సబ్‌మిట్ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఈనెల 30 లోగా పూర్తిచేయాలి. సాంకేతిక సమస్యలు ఏవైనా ఉంటే ఫోన్ 8978077156 నంబర్‌ను సంప్రదించవచ్చు.

– జి.లక్ష్మణరావు, జిల్లా సైన్స్ అధికారి, పార్వతీపురం మన్యం

విద్యార్థులను సిద్ధం చేయాలి



సైన్స్ ఉపాధ్యాయులు తమ పరిధిలో విద్యార్థులను ఈ అద్భుతమైన కార్యక్రమానికి సిద్ధం చేయాలి. గత అనుభవాలను, విజయాలను స్ఫూర్తిగా పొంది రిజిస్టర్ అయిన విద్యార్థులు తప్పనిసరిగా వారి ఆలోచనలు సబ్‌మిట్ చేసి మరోసారి జిల్లాను ముందువరుసలో ఉంచాలి. మన్యం జిల్లాలో లేదా ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంచుకుని పరిష్కారం చూపేలా విద్యార్థుల నుంచి ఐడియాలను రాబట్టాలి. టీమ్స్ ఐడియా సబ్మిషన్ ప్రతిరోజూ పరిశీలిస్తున్నాం.

– ఎస్.తిరుపతినాయుడు, డీఈఓ, పార్వతీపురం మన్యం

రిజిస్ట్రేషన్ ఇలా..

ఇప్పటికే స్టూడెంట్ రిజిస్ట్రేషన్, టీచర్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసింది. ఈ నేపథ్యంలో 6 నుంచి 10 తరగతుల మధ్య బోధన సాగిస్తున్న విద్యార్థులు (httpr://rchooinnovation marathon.orf/) లో రిజిస్ట్రేషన్ అయ్యాక పైన తెలిపిన థీమ్‌లలో ఎదో ఒక థీమ్‌లో ఒక సమస్యకు పరిష్కారాన్ని చూపే ఐడియాను సబ్‌మిట్ చేయాలి. ఆపై టాప్‌లో ఉన్న ప్రాజెక్ట్ ఐడియాలను ఎంపిక చేసి వాటికీ మెంటర్‌షిప్ ఇస్తారు. ప్రాజెక్ట్ ఐడియాను ఫొటోటైపుగా చేయడానికి కావాల్సిన టెక్నాలజీని అటల్ ఇనోవేషన్ మిషన్ ఇస్తుంది. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 30 లోగా తమ ఐడియాలను సబ్‌మిట్ చేయాలి.

మెరిట్ సర్టిఫికెట్స్ అందజేత

ప్రతి రాష్ట్రం నుంచి టాప్ 20 టీమ్స్‌కు, ప్రతి ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ నుంచి టాప్ 20 టీమ్స్‌కు, గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చే మొదటి 20 టీమ్స్, ప్రభుత్వ పాఠశాలల నుంచి టాప్ 20 స్కూల్స్, ప్రత్యేక అవసరాలు గల పిల్లల ద్వారా వచ్చే టాప్ 20 టీమ్స్‌కు మెరిట్ సర్టిఫికెట్స్ ఇస్తారు.

సీనియర్స్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక పూర్తి



సీనియర్స్ కబడ్డీ జట్ల ఎంపికలో అర్హత సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సీనియర్స్ స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఆదివారం పూర్తయ్యాయి. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 100మందికి పైగా క్రీడాకారులు తలపడ్డారు. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మంది పురుషులు, 16 మంది మహిళా క్రీడాకారులు విజయనగరం జిల్లా జట్లకు అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారులకు మంగళవారం నుంచి రాజీవ్‌క్రీడామైదానంలో కోచింగ్ క్యాంప్ నిర్వహించిన అనంతరం అందులో మెరుగైన ఆట తీరును కనబరిచే 12 మంది క్రీడాకారులను ఒక్కో జట్టులోకి ఎంపిక చేయనున్నారు. తుది జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 5 నుంచి 8వ తేదీ వరకు ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరగనున్న అంతర్ జిల్లాల సీనియర్స్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో విజయనగరం జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం హించనున్నారు. ఎంపిక పోటీలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఐవీపీ రాజు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, అసోసియేషన్ కార్యదర్శి కేవీ ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు, కోశాధికారి శివకుమార్, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

సెల్‌టవర్ ఎక్కిన యువకుడు

- మైనర్‌తో పెళ్లికి అంగీకరించాలని డిమాండ్
- కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు
- బాలికను వేధిస్తున్నాడని తల్లిదండ్రుల ఫిర్యాదు



గుమిగూడిన జనం



సెల్‌టవర్ నుంచి మాట్లాడుతున్న యువకుడు

బొబ్బిలి: ప్రేమించిన అమ్మాయి తనను పట్టించుకోకుండా అమ్మగారింటికి వెళ్లిపోతోందని, తనను పిలిపించి ప్రేమ, పెళ్లికి అంగీకరిస్తేనే దిగుతానంటూ ఓ యువకుడు సెల్‌టవర్ ఎక్కి అందరినీ భయభ్రాంతులకు గురిచేశాడు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లిలో ఉంటున్న సింగనపల్లి అజయ్‌కుమార్ అనే ఇంటర్‌మీడియట్ విద్యార్థి పదో తరగతి నుంచి తనకు పరిచయమున్న ఓ బాలికను ప్రేమించాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఆ బాలిక అమ్మమ్మగారింటి వద్ద ఉండి(అజయ్ ఉన్న ప్రాంతంలోనే)చదువుకుంటోంది. అయితే బాలిక అమ్మగారింటికి వెళ్లిపోతున్నట్లు తెలిసి అడ్డుకునే ప్రయత్నం చేసిన అజయ్‌పై తల్లిదండ్రులు పోలీసు రిపోర్టు ఇవ్వగా అజయ్‌ను పిలిచి పోలీసులు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి ఇటువంటి పనులొద్దని హెచ్చరించారు. దీంతో కోపం పెంచుకున్న అజయ్ గొల్లపల్లిలోని ఓ సెల్‌టవర్ ఎక్కి బెదిరింపులకు దిగాడు. గతంలో ఎన్నడూ ఈ ప్రాంతంలో జరగని సంఘటన కావడంతో స్థానిక ప్రజలు గుమిగూడారు. అజయ్ భవానీ మాలలో ఉండడంతో ప్రజలతో పాటు భవానీ మాలాధారులు కూడా అక్కడికి చేరుకున్నారు. సుమారు రెండు గంటల సేపు సెల్‌టవర్ ఉన్న ప్రాంతం వద్ద ఉద్విగ్న భరిత వాతావరణం నెలకొంది. సెల్‌టవర్ చివరికంటా ఎక్కి అటూ ఇటూ తిరుగుతున్న యువకుడ్ని కిందనున్న వారు గెంతవద్దు..కిందికి దిగు అంటూ కేకలు వేస్తున్నా యువకుడు చలించలేదు. తాను ప్రేమించిన అమ్మాయి పేరు చెప్పి ఇక్కడికి తీసుకువచ్చి తన ప్రేమను అంగీకరిస్తున్నానని చెప్పాలని, అప్పుడే దిగుతానని చెప్పడంతో పోలీసులు అమ్మాయిని తీసుకుని వచ్చారు. బాలికతో ప్రేమ, పెళ్లికోసం ఒప్పుకోవాలని సెల్‌టవర్ పైనుంచే యువకుడు చెప్పడంతో కిందికి దిగితే మాట్లాడదామని చెప్పించారు.

పోక్సో కేసు నమోదు

అనంతరం యువకుడ్ని కిందికి దించారు. యువకుడిని అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తనకు మైనార్టీ తీరలేదని, తీరిన వెంటనే పెళ్లి చేసుకుందామని బాలిక చెప్పిందని, ఇద్దరం ప్రేమించుకున్నామని అజయ్ పోలీసులకు చెప్పాడు. డీఎస్పీ పి. శ్రీనివాసరావు బాలిక ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించి చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామన్నారు. బాలిక, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అజయ్‌పై ఎస్సై రమేష్ పోక్సో కేసు నమోదు చేశారు. దీంతో కథ సుఖాంతమైందని అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఉమా జూట్ మిల్‌ను డిసెంబర్ 4 లోగా తెరవాలి

- లేదంటే ప్రత్యక్ష ఉద్యమానికి సిద్ధం
- కార్మిక సంఘం సాధారణ సమావేశంలో తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు గణేష్ పండా

కొత్తవలస: మండలంలోని సీతంపేట సమీపంలో గల ఉమా జూట్‌మిల్‌ను డిసెంబర్ 4వ తేదీ లోగా తెరవాలని లేదంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని కార్మిక సంఘం అధ్యక్షుడు గణేష్ పండా స్పష్టం చేశారు. ఈ మేరకు కర్మాగారం ఆవరణలో కార్మిక సంఘం సాధారణ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేయింబవళ్లు కార్మికులు 45 సంవత్సరాలుగా యాజమాన్యానికి సహకరిస్తూ 3 స్పిన్నింగ్ ఫ్రేమ్స్ నుంచి 22 స్పిన్నింగ్ ఫ్రేమ్స్‌కు, 100 మగ్గాలు పెట్టిన పురిమిల్లు నుంచి గోనె సంచులను ఉత్పత్తి చేసే మిల్లుగా అభివృద్ధి చేశామన్నారు.ఈ మిల్లులో వచ్చిన లాభాలతో ఇతర ప్రాంతాల్లో యాజమాన్యం పెద్ద ఎత్తున ఆస్తులను కూడబెట్టుకుని ఆరోపించారు. మిల్లులో తయారైన ఉత్పత్తి అమ్ముడు పోలేదని, ముడిసరుకు ధర పెరిగిపోయిందన్న నెపంతో ఈ ఏడాది జూలై-15న కర్మాగారాన్ని యాజమాన్యం మూసివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నాలుగువందల మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. జేసీఎల్, సీసీఎల్ ఆధ్వర్యంలో పలు దఫాలు చర్చలు నిర్వహించినప్పటికీ ఈ చర్చలకు యాజమాన్యం గైర్హాజరవుతూ వచ్చిందని, వచ్చేనెల 4లోగా కర్మాగారాన్ని తెరవని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.శ్రీను, కె.ఈశ్వరరావు, ఎస్.గోవింద, ఎస్.రాంబాబు, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు రేపు

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి గ్రామంలో గల ద్వాదశ దేవాలయంలో మంగళవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త నీలాపు రాజారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్రతంలో పాల్గొనే 100 కుటుంబాలకు పూజా సామగ్రి ఉచితంగా ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న భక్తులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా ఎన్‌సీసీ డే



ఎన్‌సీసీ క్యాడెట్స్ విన్యాసం

విజయనగరం అర్బన్: ఎన్‌సీసీ 76వ వార్షికోత్సవాన్ని స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఎన్‌సీసీ క్యాడెట్లు నిర్వహించిన సాహస విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపేంద్ర మాట్లాడుతూ.. క్రమశిక్షణ, నాయకత్వం వంటి లక్షణాలు పెంపొందించడానికి ఎన్‌సీసీ శిక్షణలు దోహదపడతాయన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ.. క్యాడెట్లు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి మార్గాలను అన్వేషించుకోవాలని సూచించారు. అనంతరం సీతం, సత్య డిగ్రీ కళాశాల, ఎంఆర్ కళాశాల, రఘు ఇంజినీరింగ్ కళాశాల, గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్ క్యాడెట్లు సంయుక్తంగా నిర్వహించిన సాహస విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతులు అందజేశారు. రెండవ (ఆంధ్రా) గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో 230 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, ఆరుగురు అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు, 33 మంది ఇతర సిబ్బంది హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వివిధ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

ఆలయ కమిటీల్లో విశ్వబ్రాహ్మణులకు స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల శ్రీనివాసరావు

- విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు



కార్యక్రమంలో పాల్గొన్న సంఘ ఉద్యోగులు, తదితరులు

డెంకాడ: ఆలయ కమిటీల్లో విశ్వ బ్రాహ్మణులకు చోటు కల్పించాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని చింతలవలసలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆలయ కమిటీల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పించి విశ్వబ్రాహ్మణులను విస్మరించడం బాధాకరమన్నారు. విశ్వబ్రాహ్మణులకు చట్ట సభల్లో కూడా తగిన స్థానం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.సన్యాసిరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుగంధం నాగమల్లేశ్వరరావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు కోసూరి విజయ్‌భాస్కరరావు, జిల్లా నాయకులు ఆవుపాటి నాగభూషణరావు, కోసూరి రాంబాబు, ఉమామహేశ్వరరావు, ఉమాపతి, సోమశేఖర్, సంఘ నాయకులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

☛ జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవం..

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘ జిల్లా నూతన శాఖ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైందని రాష్ట్ర నాయకులు ప్రకటించారు. సంఘ జిల్లా అధ్యక్షుడిగా కాకినాడ ఉమామహేశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షులుగా అప్పరభట్ల నరసింహరాజు, ఆవుపాటి నాగభూషణం, కన్వీనర్‌గా కోసూరి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా వదురుపర్తి గీత సత్య ఉమాపతి, కోశాధికారిగా మంతెన అప్పలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శంభాన లక్ష్మణరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కెల్ల సోమశేఖర్ ఎన్నికయ్యారని తెలిపారు.

భైక్ బోల్తా పడి మహిళ దుర్మరణం

- భర్త, పిల్లలకు గాయాలు
- ఆడలి ఘాట్‌రోడ్డులో ప్రమాదం



భారతి మృతదేహం

సీతంపేట: అందరిలాగే ఆ కుటుంబం కూడా పిక్నిక్‌లో భాగంగా ఆదివారం ఆడలి వ్యూపాయింట్‌ను సందర్శించి ఆనందంగా గడిపింది. ఆ ఆనందంలో తేలియాడుతున్న లోగానే మృత్యువు ఆ కుటుంబంలోని మహిళను కబళించింది. భర్త, పిల్లలకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. పాలకొండకు చెందిన దుప్పాడ దుర్గారావు, భార్య భారతి, పిల్లలు మేఘన, పల్లవిలు ద్విచక్రవాహనంపై సీతంపేట ఏజెన్సీలో మారుమూల ఉన్న పర్యాటక ప్రదేశమైన ఆడలి వ్యూపాయింట్‌కు వెళ్లారు. తిరుగుప్రయాణంలో ఘాట్‌రోడ్ బిడిందిగూడ మలుపు వద్దకు వచ్చేసరికి బైక్ అదుపుతప్పి లోయలో పడడంతో భారతి (33) అక్కడికక్కడే దుర్మరణం చెందింది. భర్త దుర్గారావుకు తీవ్రగాయాలు, పిల్లలకు గాయాలు కావడంతో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇదే ఆస్పత్రికి భారతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

సెపక్‌తక్రా సబ్ జూనియర్స్ పోటీలకు జిల్లా జట్ల పయనం



నందికొట్కూరులో పోటీలకు పయనమవుతున్న జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సెపక్‌తక్రా సబ్‌జూని యర్స్ బాల, బాలి కల పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్లు ఆదివారం పయనమయ్యాయి. ఈనెల 26,27 తేదీల్లో నంద్యాల జిల్లా నందికొట్కూరులో అంతర్ జిల్లాల సెపక్‌తక్రా పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో జిల్లానుంచి పాల్గొనే జట్లు పయనమవగా..జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురానఅయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావులు క్రీడాకారులకు సలహాలు, సూచనలు అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాజేష్, అధ్యక్షుడు ఆదినారాయణ, కోశాధికారి భవాని, పీడీలు పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు విద్యార్థుల ఎంపిక




జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన పారాది జెడ్పీహెచ్ స్కూల్ క్రీడాకారులు

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 22 నుంచి 24వరకు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్ 14 విభాగం క్రీడా పోటీలు చిత్తూరులో జరగ్గా ఆ పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబర్చిన తమ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు తెలిపారు. ఎంపికైన వారిలో సీహెచ్ గౌతమ్, మణికంఠ, పవన్, ఇందు, అవంతికలు ఉన్నారని, డిసెంబరులో జాతీయస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని హెచ్ఎం తెలియజేశారు.

అపార్‌తో విద్యార్థులకు కష్టాలు

- ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్

పార్వతీపురంటౌన్: అపార్ ఐడీతో విద్యార్థులు తీరని కష్టాలు ఎదుర్కొంటున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవి కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం వన్ నేషన్ వన్ స్టూడెంట్ నినాదంతో దేశవ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రేషన్ (అపార్) పేరిట జారీ చేస్తున్న కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలతో పాటు పార్వతీపురం జిల్లాలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వాటి పరిష్కారానికి జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖల్లో అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ఉన్న ఆధార్ కార్డులో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పేర్లలో తప్పులు, స్కూల్ రికార్డుల్లో జన్మదిన తేదీల మార్పు, చిన్నపాటి అక్షర దోషాలు, గ్రామ, నగరపంచాయతీ పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థలో నమోదై ఉన్న జనన ధ్రువీకరణ పత్రాల్లో విద్యార్థుల ఇంటి పేర్లు, పూర్తిపేర్లు నమోదు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిన్నచిన్న అక్షర తప్పులు తదితర సమస్యలు సరిచేసేందుకు విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లు ఆధార్ నమోదు కేంద్రాలు లేకపోవడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బర్త్ సర్టిఫికెట్ కావాలంటే వీఆర్‌ఓలు వేలాది రూపాయలు విద్యార్థి తల్లిదండ్రుల దగ్గర వసూలు చేస్తున్నారని, దీనిపై తక్షణమే కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.